

# మనసున మల్లెల మాలలు

వి.యల్.వి.భారతి

తూరుపున వెలుగు రేఖలు విచ్చుకునేవేళ ఆ ఊళ్ళోకి కొత్తగా అడుగుపెట్టిన అనంత్ చుట్టూ పరిశీలిస్తూ నడవసాగాడు. పక్షుల కిలకిలరావాలు ఇంపైన సంగీతంలా వీనులకి హాయినిస్తున్నాయి.

నున్నగా కనిపించే దూరపు కొండలు నీరెండ స్పర్శకి కన్నెపిల్ల నున్నని చెక్కిళ్ళలా మెరుస్తున్నాయి. గాలి అలలపై తేలివచ్చే గుడిగంటలు మంగళ వాద్యాలై తనకి స్వాగతం చెప్తున్నట్టు తోచిందతనికి.

పచ్చని పంటపొలాలు,హాయి గొలిపే చల్లటి గాలి వినీలాకాశం స్వచ్ఛత మనసుకి అంతులేని ప్రశాంతత కలిగిస్తుంటే ఇంత చక్కని ప్రకృతి మధ్య జీవించి ఎంత కాలమైంది అనుకుంటూ సన్నగా ఈల హమ్ చేస్తూ హుషారుగా వెళ్తున్న అతని కాళ్ళకి ఓ మధుర కంఠస్వరం కారణంగా బ్రేకు పడింది.

కాలువ గట్టున కూర్చుని ఓ పల్లెపడుచు చేత్తో జామపండు చిలుక నోటికి అందిస్తూ ఎంతో శ్రావ్యంగా 'మనసున మల్లెల మాలలూగెనే - కన్నుల వెన్నెల డోలలూగెనే' అంటూ పాడుతోంది. ఆమె గుడినుంచి వస్తున్న గుర్తుగా మరో చేతిలో పూలసజ్జ, కొబ్బరికాయలు.

ఆ చక్కటి ప్రకృతిలో ఆ దృశ్యం ఎంతో అద్భుతంగా అనిపించింది. అటువైపు అడుగులేశాడు.

ఓహ్...! బంగారపు మెరుపుతీగ! విశాలమైన నుదుటిపై వంకీలు తిరిగిన ముంగురులు గాలితో సయ్యాటలాడుతూ పాలభాగాన్ని తనివితీరా చుంబిస్తున్నాయి. చెర్రీ పండులాంటి ముచ్చటగొలిపే తేనెలూరు పెదవులు, అవి చెక్కిళ్ళా... కాదు గులాబీ రేకుల రాశులు! చక్కని ముఖవర్చస్సు! నడుము చూస్తే మృగరాజ మధ్యమంలా ...!

ఏ దేవకన్యో అక్కడి ప్రకృతి అందాలకి పరవశించి భువికి దిగిందా అనిపించేటంతటి ఆ అద్భుత సౌందర్యానికి ముగ్ధుడై చూస్తూ తనని తాను మరిచాడు.

అంత దగ్గరగా నిలబడ్డ ఆ అపరిచితుడు, స్ఫురద్రూపి అయిన యువకుడ్ని చూసి తొట్రుపాటుగా లేచి నిలబడింది.

'యవ్వనం చిగురించిన కొత్తలో ప్రతి వ్యక్తి హృదయం ఎవరికోసమో తనకు తెలియకుండానే ఎదురుచూస్తుంది. ఇష్టమైన వ్యక్తి ఎదురుపడగానే ఆ మనసు ఎంతో చిత్రంగా మధురంగా స్పందిస్తుంది. ఆ వింత స్పందనే ప్రేమా? అనుకున్నాడు అనంత్.

''ఎ...ఎవరు మీరు?'' ఆమె మాటల్లో తడబాటు.

''నేను పరంధామయ్య మాస్టారు గారి అబ్బాయి అనంత్‌ని. పట్నంలో చదువు పూర్తిచేసి కొత్తగా ఈ ఊరికి వచ్చాను. నాన్నకి నెలక్రితమే ఈ ఊరి స్కూలుకి ట్రాన్స్‌ఫర్ అయింది. నాకు ఇల్లు తెలీదు. మీకు తెలిస్తే..'' ఆమెపై నుంచి చూపు మరల్చకుండా తదేకంగా కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు.

పూల బాణాల్లా గుచ్చుకునే ఆ చూపులకి ఆమె బుగ్గల్లో కెంపులు పూశాయి.

ఎలా వెళ్ళాలో అడ్రసు చెప్పి 'ఇంకా నిలబడ్డావేం వెళ్ళు' అన్నట్లు చురుక్కుమని చూసింది.

ఆ భావం గ్రహించినా అక్కడ్నుంచి అంగుళమైనా కదలక

''మీ పేరు?'' అన్నాడు. రెప్పవేసిన మరుక్షణం ఆమె అదృశ్యమైపోతుందేమోనన్న ఆందోళన అతనిలో.

''మీ పేరులో సగమే నా పేరులో సగం'' మునిపంటితో క్రింది పెదవిని నొక్కిపెట్టి ముసిముసిగా నవ్వుకుంటూ ఛెంగుమని లేడిపిల్లలా గెంతి పరుగు తీసింది.

టీనేజీని వీడని ఆ చిలిపితనం అతని మనసులో గిలిగింతలు రేపింది. గడుసుపిల్లే అనుకుంటూ ఆవైపే చూస్తున్న అతని భ్రుకుటి ముడిపడింది.

నేలపై అకస్మాత్తుగా చతికిలబడి కాలు పట్టుకుందామె.

''అరెరే! ఏమైంది?'' దగ్గరగా వెళ్ళాడు.

లేత తమలపాకులాంటి మెత్తని పాదంలో నల్లని ముల్లు కసిగా దిగబడి వుంది. ఆ బాధకి ఆమె కళ్ళనిండా నీళ్ళు. అనంత్ మనసు ద్రవించింది. చటుక్కున కూర్చుని ఆమె కాలు ఒడిలోకి తీసుకున్నాడు. పూల చెండుని చేతుల్లోకి తీసుకున్న అనుభూతి!

ముల్లు మెల్లగా బైటికి తీస్తున్నప్పటికీ బాధతో అతని భుజాలు గట్టిగా గుచ్చి పట్టుకుని బలంగా తోసేస్తూ విలవిల్లాడింది.

చివ్వున చిమ్మిన రక్తాన్ని తుడిచి కర్చీఫ్‌తో కట్టుకట్టాడు. రాలిపడిన పువ్వుల్ని, కొబ్బరికాయనీ సజ్జలో పెట్టి చేతికిచ్చి ఆమెని నిలబెట్టాడు.

చక్రాల్లాంటి అందమైన ఆ కళ్ళల్లో కృతజ్ఞత తళతళ మెరిసింది. నెమ్మదిగా నడుచుకుంటూ మళ్ళీ మళ్ళీ వెనుదిరిగి చూస్తూ వెళ్ళిపోయిందామె.

ఆవైపే చూస్తూ అనుకున్నాడు అనంత్.

'నేను కవిని కాదు. నీ సౌందర్యాన్ని తనివితీరా వర్ణిస్తూ అందమైన కావ్యాలు రాయటానికి. చిత్రకారుణ్ణీ కాను. నీ ఒంపుసొంపుల్ని కాన్వాసుపై పరిచి పదేపదే చూస్తూ పరవశించడానికి. కానీ ఒకటి మాత్రం చెయ్యగలను. గుండెనిండా వున్న ప్రేమని దోసిళ్ళ నింపి నీ పాదాలముందు పరుస్తాను. నిర్ధయగా నడుచుకుంటూ వెళ్ళిపోతావో... అపురూపంగా దోసిళ్ళకెత్తి ఆర్తిగా గుండెలకదుముకుంటావో'.

* * *

'అధరము తాకిన వేణువెంత ధన్యమైనదో' అనుకుంటూ పరవశంగా ఆ వేణుగాన మాధుర్యంలో లీనమైందామె.

పాట పూర్తవ్వగానే చప్పట్లు కొట్టి అభినందించింది. ప్రసాదం కళ్ళకద్ది అనంత్ నోటికి అందించింది.

ఏటిగట్టుపై కూర్చున్న తమ ప్రతిబింబాలు నీటి అలలపై తేలియాడుతుంటే ముచ్చటగా చూస్తూ

''అనూ...'' అని పిలిచాడు.

''ఊ!'' అంతే పరవశం అనూరాధలో!

''మన పేర్లలో మొదటి రెండక్షరాలూ ఒకటే కదూ. అందుకేనా ఆరోజు అలా గడుసుగా జవాబిచ్చి తప్పించుకున్నావ్?'' ఆమె ముంగురులు లాలనగా సవరిస్తూ గుసగుసగా పలికాడు.

''చూడు! నీకిష్టమని పూతరేకులు తెచ్చాను''

అనూరాధ సున్నితంగా తిరస్కరించింది. బలవంతంగా నోటికందించబోయి ఆ కళ్ళు చూసి చలించాడు. అవి ముత్యాల బిందువుల్ని రాల్చడానికి సిద్ధంగా వున్నాయి.

''అనూ! నిన్ను విడిచి ఒక్క క్షణం కూడా వుండలేను. నువ్వు ఊరెళ్ళడం మానుకోకూడదా?''

ఆ కళ్ళల్లో బేలతనం.

''ప్లీజ్ అనూ! కాస్త కంట్రోల్ చేసుకో. ముందు అక్కడ ఉద్యోగంలో జాయినయ్యి నెలరోజుల్లో వచ్చేస్తాగా నా దేవికోసం. ఈ యువరాణిని నా పట్టపురాణిగా చేసుకుంటానని అప్పుడు అందరికీ తెలియపరుస్తా సరేనా?''

''నిజంగానా?'' రెప్పలు అల్లాడించింది.

కాలం తెలీకుండా ఒకళ్ళ కళ్ళల్లోకి ఒకళ్ళు చూస్తూ ఎంతసేపు వుండిపోయారో తెలీదు. ఒంటిపై పడ్డ చినుకులు ముత్యాల్లా జారిపోతుంటే ఉలిక్కిపడి ఈ లోకంలోకొచ్చారు.

దూరంగా వినీలాకాశంలో ఏనుగుల గుంపులా దట్టమైన నల్లని మేఘాలు ఆక్రమించుకుంటున్నాయన్న సంగతి అప్పుడు గమనించారు.

ఇద్దరూ చెట్టపట్టాలేసుకుని కోవెల మండపంలోకి వచ్చేసరికి పూర్తిగా తడిసిపోయారు.

దూరంగా కొండవాలుపై జాలువారుతున్న వర్షం మలిసంధ్య లేత ఎండలో వెండి పువ్వులై మెరుస్తోంది. వర్షానికి తమ హర్షాన్ని వ్యక్తం చేస్తున్నట్లు ఆనందంతో చెట్లు గాలికి తెగ ఊగుతున్నాయి.

'నేను కవిని కాదు. నీ సౌందర్యాన్ని తనివితీరా వర్ణిస్తూ అందమైన కావ్యాలు రాయటానికి. చిత్రకారుణ్ణీ కాను. నీ ఒంపుసొంపుల్ని కాన్వాసుపై పరిచి పదేపదే చూస్తూ పరవశించడానికి. కానీ ఒకటి మాత్రం చెయ్యగలను. గుండెనిండా వున్న ప్రేమని దోసిళ్ళ నింపి నీ పాదాలముందు పరుస్తాను. నిర్ధయగా నడుచుకుంటూ వెళ్ళిపోతావో... అపురూపంగా దోసిళ్ళకెత్తి ఆర్తిగా గుండెలకదుముకుంటావో'

రివ్వుమని వీచే ఈదురుగాలి వెన్నులోంచి సన్నని వణుకు పుట్టిస్తుంటే అరవిరిసిన మొగ్గలా వున్న ఆమెకి మరింత దగ్గరగా జరిగాడు అనంత్.

ప్రేమికులకి ఏకాంతం దొరకడమే అరుదు. అందులోనూ ఇలాంటి వాతావరణంలో ఆ అనుభవం ఎదురైతే మనసులెంత ఆనంద పారవశ్యం పొందుతాయో చిత్రంగా స్పందించే ఆ ఇద్దరి గుండెల సవ్వడే సాక్ష్యం.

తడిసిన ఓణీలోంచి ఒంపుసొంపులన్నీ కనువిందు చేస్తూ ఊరిస్తుంటే అతని యవ్వనంలో ఏదో అలజడి సుడులు తిరిగింది. ఏదో పొందాలన్న ఆవేశం అంతకంతకూ అధికమౌతుంటే నిగ్రహం అతన్నొదిలిపోవాలని పెనుగులాడుతోంది.

మేఘాల రాపిడిలో పుట్టిన మెరుపులు చురుకైన వేగంతో వచ్చి ఆమె నున్నని బుగ్గల్లోకి చొచ్చుకుపోతుంటే ఆ అద్భుత దృశ్యాన్ని తనివితీరా ఆస్వాదించాడు అనంత్.

ఆ కళ్ళల్లో భయపడిన లేడి బెదురు చూపులు ముచ్చటగొల్పుతుంటే చటుక్కున వంగి ఆ రెండు కళ్ళపై పెదవులుంచి గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు.

'ధఢాల్'మని ఎక్కడో పిడుగు పడినట్లు భీతిగొలిపే శబ్దం. అనురాధ కెవ్వుమంది.

ఆమె అతన్ని లతలా పెనవేసుకుందో అతనే ఆమెని గట్టిగా కౌగిలించుకున్నాడో చెప్పడం కష్టం. ఇరువురిలో చెలరేగిన కోరికల సెగలకి సాక్ష్యంగా వెచ్చని ఊపిరి. వెన్నులోంచి జలజల పాకే వణుకుని అది అణచటానికి తనవంతు ప్రయత్నం చేస్తోంది.

ఆమె తనువులో అణువణువుపై ముద్రవేయాలని తహతహలాడే అతని పెదవులు హద్దులు దాటాయి.

వీణని శృతిచేస్తున్నంత వయ్యారంగా అతని చేతివేళ్ళు ఆమె అందాలన్నింటినీ మీటుతున్నాయి.

ఆమెలో ద్వైదీభావం! ఒకపక్క మనసులో ఇష్టం. మరోవైపు ఏదో తెలీని భయంతో పెనుగులాటకి ప్రయత్నం!

మెరుపు వెలుగులో చూశాడు సగం అనాచ్ఛాదితమై వున్న ఆ మేని సౌందర్యాన్ని కాదు. ఆమె కళ్ళల్లో భయాన్ని. తప్పు జరుగుతుందేమో అన్న గిల్టీ ఫీలింగ్‌తో చిగురుటాకులా కంపించిపోయే ఆ లేత యవ్వనాన్ని.

అంతే అతనిలో వివేకం మేల్కొంది. చప్పున లేచి ఆమెని వదిలేశాడు. అస్తవ్యస్తమై వున్న వస్త్రాలని సరిచేశాడు. చెదిరిన జుట్టు సవరించాడు. ఊపిరాడనంతటి బిగి కౌగిలిలో బంధించి చెవిలో చెప్పాడు గుసగుసగా 'వచ్చేనెల లీవు పెట్టి వస్తాను. అప్పుడే మన పెళ్ళి. ఆ తర్వాతే అన్నీనూ.''

* * *

నెలరోజుల తర్వాత అనంత్ అనుకున్నవేవీ జరగలేదు. పెద్దలు వీరి ప్రేమని తీవ్రంగా వ్యతిరేకించారు. అనంత్‌ని కలుసుకోకుండా అనురాధని దూరంగా బంధువుల వూరికి పంపారు.

ఆమె ధ్యాసలో కొన్ని నెలలు పిచ్చివాడే అయ్యాడు అనంత్. ఆ ఊరి బడిలోనే ఉపాధ్యాయుడిగా పనిచేసే రాఘవ్ స్నేహంతో కొంత ఊరట పొందేవాడు.

అనురాధని మరువలేక, ఆమె నుంచి ఏ సమాచారమూ రాక ఆఫీసుకి మాత్రం మొక్కుబడిగా వెళ్తూ జీవచ్ఛవంలా తయారయ్యాడు.

ఓరోజు అనురాధ ఊళ్ళోకొచ్చిందన్న తియ్యటి వార్త రాఘవ్ ఇచ్చిన టెలిగ్రాం ద్వారా తెలిసి ఆఫీసుకి లీవుపెట్టి రెక్కలు కట్టుకుని ఆఘమేఘాల మీద వచ్చి వాలాడు అనంత్.

ఇద్దరూ మునుపటిలా కోవెల పక్కన కోనేటి గట్టున కలుసుకున్నారు.

ఇన్నాళ్ళు ఒకరికోసం ఒకరు తపించిపోయిన రోజుల్ని, అనుభవించిన విరహ బాధనీ, కౌగిలించుకున్న తనువుల స్పర్శ ద్వారా తెలుపుకున్నారు.

''నాకు మా మేనబావతో పెళ్ళి నిశ్చయమైంది. నేను ఇక్కడికి రావటం అమ్మానాన్నకి ఇష్టం లేదు. చెల్లి పెద్దమనిషైందన్న వంకతో ఈ ఊరికొచ్చాను. అనూ...! దయచేసి నన్ను ఎలాగైనా నీ దాన్ని చేసుకో. లేకపోతే నాకు ఆత్మహత్యే శరణ్యం'' భోరున విలపించిందామె.

''ఒకరు లేకుండా ఒకరం బ్రతకలేం. అలాగని పెద్దలని ఎదిరించే ధైర్యమూ లేదు. పరిస్థితులకి రాజీపడి జీవచ్ఛవాల్లా జీవించలేం. దీనికొకటే మార్గం. ఇద్దరం అమర ప్రేమికులం కావడమే'' అంటూ తన నిర్ణయాన్ని చెప్పాడు అనంత్. ఆమె తన అంగీకారాన్ని తలూపుతూ తెలిపింది.

మర్నాటికి తమ ప్లాన్ ప్రకారం అంతా సిద్ధం చేసుకున్నారు. తోటలోకి పరుగుదీసి పురుగుల మందు డబ్బా మూత తెరిచేసరికి రాఘవ్ ప్రత్యక్షమయ్యాడు.

''నా అనుమానం నిజమయింది. అందుకే మిమ్మల్ని ఓ కంట కనిపెడుతూనే వున్నాను. పిరికివాళ్ళకి ప్రేమించే అర్హత లేదు. జీవితాన్ని ఓ ఛాలెంజ్‌గా తీసుకుని ధైర్యంగా ఎదుర్కోండి. ఇవిగో రైలు టిక్కెట్లు. రేపే ఈ ఊరు విడిచి పారిపోయి ఎక్కడైనా సుఖంగా జీవించండి'' గీతోపదేశం చేసిన కృష్ణుడి లెవెల్లో ఓ చిన్న ఉపన్యాసమిచ్చాడు రాఘవ్.

మర్నాడు కట్టుబట్టల్తో రైలెక్కుతున్న ప్రేమ జంటకు ''ఈరోజు ప్రత్యేకత ఏంటో తెలుసా? ఫిబ్రవరి 14. ప్రేమికుల రోజు'' అంటూ గ్రీటింగ్స్ అందజేసి వీడ్కోలిచ్చాడు రాఘవ్.

* * *

ఓ నలభై ఏళ్ళ తర్వాత......

''నేను అమ్మని తీసుకెళతాను. నువ్వు నాన్నని దగ్గరుంచుకో''

''అహ! వద్దు. అదేం కుదరదు. అమ్మయితే ఇంటి చాకిరీకి పనికొస్తుందని ప్లాను వేశావేం? నేనే అమ్మని తీసుకెళ్తాను. నువ్వే నాన్నని వుంచుకో.''

''అబ్బా! మీరిలా రండి. మావయ్యగారితో మాత్రం ప్రయోజనం లేదనుకున్నారా? పిల్లల ట్యూషను ఖర్చు తగ్గుతుంది. మీకు బజారు పనుల శ్రమ తప్పుతుంది'' కోడలుగా నటించే పిల్ల గొంతు తగ్గించి అన్న మాటలకి ఉలిక్కిపడి బైటికొచ్చారు అనంతం గారు.

పదిహేను రోజుల క్రితం జరిగిన సంఘటనే 'అమ్మా-నాన్న' ఆటల్లో మనవలు డైలాగులుగా విసురుతున్నారు.

మనసంతా చేదుగా మారింది. 'తన జీవిత సహచరి అనూ చిన్నకొడుకు దగ్గరికెళ్ళి పదమూడు రోజులైంది. అసలే నడుం నొప్పి. బి.పి. పేషంటు. ఆరోగ్యం ఎలా వుందో ఏమో!'' ఆందోళన పడ్డారాయన.

పెళ్ళయినప్పటినుంచీ ఇప్పటిదాకా ఒకర్నొకరు విడిచి వుండలేనంత గాఢమైన అనుబంధం తమది. అలాంటిది కొడుకుల స్వార్థం నేపథ్యంగా ఇప్పుడు ఇద్దరూ బలవంతంగా విడివిడిగా బతకాల్సిన కర్మ



## పాలపళ్లు వచ్చేదశలో...

ఈ మధ్య చిన్న పిల్లల్లో దంత సంబంధ వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయి. నోటిని, దంతాలను సరిగ్గా శుభ్రపరుచుకోకపోవడం, చాక్లెట్లు, పళ్లకు అతుక్కుపోయే తీపిపదార్థాలను ఎక్కువగా తీసుకోవడం మూలంగా పిల్లల్లో పిప్పిపళ్లు, నోటి దుర్వాసన ఎక్కువవుతున్నాయి. ముఖ్యంగా చంటిపిల్లలకు పాలపళ్లు వచ్చేదశలో చిగుళ్లు ఎక్కువగా దురదపెడుతుంటాయి. దీంతో చేతికి అందిన ప్రతి వస్తువును తీసుకొని నోట్లో పెట్టుకుంటుంటారు. ఇటువంటప్పుడు పిల్లల్లో విరేచనాలు, వాంతులు వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. పిల్లల్లో దంత సంబంధ సమస్యలు రాకుండా చూడాలంటే పాలపళ్లు వచ్చే దశలోనే సరైన జాగ్రత్తలు పాటించాలి.

- చంటి పిల్లలకు పళ్లు వచ్చే ముందర చిగుళ్లు దురదపెడుతుంటాయి. ఇటువంటప్పుడు మార్కెట్లోకి పిల్లలకోసం ప్రత్యేకంగా వచ్చిన జెల్‌పేస్ట్‌ను ఉపయోగించి వీలైనన్ని సార్లు చిగుళ్లకు అదిమిపట్టి రాస్తే దురద తగ్గుతుంది.
- క్యారెట్లు, బీన్స్ వంటి కాయగూరలు, యాపిల్స్, జామ వంటి పళ్లను చంటిపిల్లల చేతికిస్తే వాటిని కొరుకుతూ వుండడంతో దంతాల వల్ల వచ్చే దురద తగ్గుతుంది. అన్నిరకాల పండ్లు తినడం అలవాటవుతుంది. దీని ద్వారా పోషకాలు సక్రమంగా అందుతాయి.
- దంతాలకు అతుక్కుపోయే పదార్థాలు, చాక్లెట్లు, మాంసాహారం తిన్న తర్వాత బ్రష్‌తో శుభ్రపరుచుకునేలా పిల్లలకు అలవాటు చేయాలి.
- ఉదయం, రాత్రి వేళల్లో భోజనానంతరం తప్పని సరిగా బ్రష్ చేసుకోవాలని పిల్లలకు తెలియజెప్పాలి.
- వీలైనన్ని సార్లు పిల్లల చేతుల్ని శుభ్రపరచడం ద్వారా వేళ్లు నోట్లో పెట్టుకున్నా అనారోగ్య సమస్యలు దరిచేరవు.

పట్టింది'' భారంగా నిట్టూరుస్తున్న ఆయన కళ్ళల్లో సన్నటి కన్నీటి పొర.

* * *

''ఒరేయ్! మీ నాన్నకి ఒంట్లో బాగోలేదు కదరా. ఒకసారి వెళ్ళి చూసొస్తాను'' మౌనంగా వున్న కొడుకు దగ్గర మూడోసారి బతిమాలారు అను రాధమ్మగారు.

కొడుకుని కనుసైగతో పక్కకి పిలిచింది కోడలు.

''మీకేమైనా తెలివుందా అసలు? మామయ్య గారికి జ్వరమని ఆవిడకెందుకు చెప్పారు? ఇప్పుడు చూడండి అక్కడికి వెళ్తానని ఎలా గొడవ చేస్తోందో? ఏదో ఒకటి సర్ది చెప్పండి. ఆవిడ వెళ్ళిపోతే ఈ ఇంటెడు చాకిరీ నా ఒక్కర్తికీ వీలుకాదు'' విరుచుకు పడుతున్న కోడలి గొంతు విని అవాక్కైంది ఆవిడ.

''అమ్మా! అక్కయ్య ఆఫీసుకి ఫోను చేసింది. నీ మనవరాలికి పెళ్ళి కుదిరిందట. వచ్చేనెల ఎలాగూ పెళ్ళికి వెళ్ళక తప్పదు. మళ్ళీ ఇప్పుడు ప్రయాణ మంటే బోలెడు ఖర్చు కదమ్మా'' చెప్పలేక చెప్తూ నీళ్ళు నములుతున్న కొడుకువైపు నిస్సహాయంగా చూసింది.

భర్తని కలిసేందుకు కారణమయ్యే మనవరాలి పెళ్ళికోసం రోజుల్ని లెక్కపెట్టుకుంటూ ఎదురుచూస్తోంది ఆవిడ.

* * *

పెళ్ళి పందిట్లో అందరూ హడావిడిగా తిరుగుతూ, నవ్వుతూ, తుళ్ళుతూ కబుర్లు చెప్పుకుంటుంటే అంత పెద్ద హాల్లో ఒక మూలగా వేసున్న రెండు కుర్చీల్లో కూర్చున్నారు ఆ వృద్ధ దంపతులు.

విడువలేనంత ఆప్యాయంగా చేతులు పట్టుకుని ఒకరినొకరు అపురూపంగా చూసుకుంటున్న ఆ రెండు జతల కళ్ళల్లో నీరు ఉబికింది.

పెళ్ళికొచ్చిన రాఘవయ్య గారు వీరిద్దరినీ జాలిగా చూశారు. ఆయన మనసులో ఓ పరిష్కారం తళుక్కుమని మెరిసింది.

* * *

పెళ్ళయిన మర్నాడు ఆ దంపతులు ఎవ్వరికీ కనబడలేదు. కొడుకులూ, కోడళ్ళూ ఫంక్షన్ హాలంతా వెతికారు.

రాఘవయ్య గారు తాపీగా జేబులోంచి ఓ పింకు కవరు తీసి వాళ్ళ చేతుల్లో పెట్టారు. పెద్దకొడుకు దాన్లోంచి ఓ ఉత్తరాన్ని బైటికి తీశాడు.

చిరంజీవులు రాజు, రవి

మీకు మా ఆశీస్సులు. నా జీవితంలో ఇలాంటి రోజు ఒకటి వస్తుందని మీకిలా ఉత్తరం రాయాల్సి వుంటుందని కల్లో కూడా అనుకోలేదు. ఒరేయ్! తల్లిదండ్రులిద్దరూ కలిసేరా పిల్లల్ని కనేది. కానీ ఆ ఇద్దర్నీ కలిపి ఒక దగ్గర వుంచుకోవడం వారికి భారమైపోతుందంటరా? రెక్కలొచ్చి పిల్లలు తమ దిక్కు తాము చూసుకున్నాక ఈ ముసలితనంలో వారికి అసలైన తోడు వారి జీవిత భాగస్వామియే.

నలభై ఏళ్ళుగా కష్టసుఖాల్లో తోడునీడగా వుంటూ తనువులో సగభాగమైన నా బెటర్‌హాఫ్‌కి ఈ వయసులో ఇలా దూరంగా వుండి ఒంటరిగా బతకడం ఎంత దుర్భరమో మీరాలోచించారా? స్వార్థం నేపథ్యంగా ఉమ్మడి కుటుంబాలు నశించిపోతున్న ఈ రోజుల్లో మానవ సంబంధాలు, విలువలకి కూడా తిలోదకాలిచ్చే పరిస్థితి ఏర్పడుతోందా అన్న అనుమానం కలగక మానదు.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే మాలాంటి పరిస్థితి మీకు రాకూడదని. ఆమధ్య మీ పిల్లలు తమ ఫ్రెండ్సుతో 'అమ్మా-నాన్న' ఆట ఆడుతూ వృద్ధ దంపతులుగా నటిస్తున్న ఇద్దర్నీ పిల్లలు చెరొక్కరు పంచుకోవటం చూసి మనసు ద్రవించింది. ఆ పసి మనసుల్లో ఇలాంటి ప్రతి సంఘటనా బలమైన ముద్ర వేసి భవిష్యత్తులో మేమూ ఇలానే ప్రవర్తించాలి కాబోలు అన్న కొత్త సంప్రదాయానికి తెరతీసినా ఆశ్చర్యంలేదు.

మా పెంపకంలో, మేము మీకు పంచి ఇచ్చిన ప్రేమలో ఎక్కడ లోపం వుందో అర్థం కావట్లేదు. మీ పిల్లలూ మీలా తయారుకాకుండా సక్రమంగా పెంచండి.

పెళ్ళింట్లోంచి ఇలా మేమిద్దరం ఎవ్వరికీ చెప్పాపెట్టకుండా పారిపోవడం మీకు కొంత ఎబ్బెట్టుగానూ, ఒకింత అవమానంగానూ అనిపించవచ్చు. కానీ ఇది మా దృష్టిలో మాత్రం సబబే.

మీకో సంగతి తెలీదు అసలు. మా పెళ్ళి ఎలా జరిగిందో! మేమిద్దరం ఒకరినొకరం అమితంగా ఇష్టపడ్డాం. షరామామూలే ఇద్దరి పెద్దలూ తీవ్ర అభ్యంతరం చెప్పారు. మీ అమ్మకి ఆమె మేనబావతో సంబంధం నిశ్చయమైంది. మా మనసుల్లో అంతులేని అలజడి. భవిష్యత్తు పట్ల పెంచుకున్న ఆశలూ, కట్టుకున్న కలల సౌధాలూ ఒక్కొక్కటిగా కూలిపోతుంటే ఒకరినొకరం విడిచి వుండలేని మా మానసిక స్థితి ఆలోచనా మమ్మల్ని ఆత్మహత్యా ప్రయత్నం వైపు దారితీశాయి. కాని రాఘవయ్య మాస్టారే మా ఇద్దరికీ మెత్తగా చీవాట్లు పెట్టి ధైర్యం చెప్పి రైలు టిక్కెట్లు కొనిచ్చి ఇంట్లోంచి పారిపోయేలా దగ్గరుండి సహకరించాడు. అలా కన్నవాళ్ళకీ ఉన్న ఊరికీ దూరంగా బైటికొచ్చి ధైర్యంగా జీవితం సాగించాం.

ఆనాడు మా పెద్దలు ఒకరినొకరు ప్రాణంగా వున్న మా ఇద్దర్నీ విడదీస్తారేమో అన్న భయం అలా పారిపోవడానికి నేపథ్యమైతే ఈరోజు మా కడుపున పుట్టిన పిల్లలే మా పోషణ ఖర్చు భారమౌతుందన్న స్వార్థంతో చెరొకరూ మమ్మల్ని పంచుకుని విడదీస్తారేమో అన్న భయంతో మళ్ళీ అయిన వాళ్ళందరికీ దూరమౌతున్నాం.

ఆరోజు జీవితం పట్ల మళ్ళీ మమకారం పెంచుతూ మేం పారిపోవటానికి సహకరించిన రాఘవయ్య మాస్టారే ఈనాడు మలి సంధ్యలో వున్న మా జీవితాల్ని ఒక దగ్గరికి చేర్చి శేషకాలాన్ని ఒకరికొకరుగా వుంటూ ఆనందంగా జీవించండి అని మమ్మల్ని ఆశీర్వదించి పంపిస్తున్నారు.

అత్యవసర సమయంలో ఆదుకుంటుందని నా సర్వీసు కాలంలో మీకు తెలీకుండా నేను వెనకేసిన కొంత మొత్తం వుంది. నాకింకా ట్యూషన్లు చెప్పుకుని సంపాదించే శక్తి వుంది. ఈ రెండు చాలూ నా భార్యని నేను పోషించుకోవటానికి, మా జీవితాలు ఈ చివరి దశలో సాఫీగా సాగటానికి.

మీరు మాకోసం వెతకద్దు. మా దగ్గరికొచ్చి మళ్ళీ మమ్మల్ని చెరొకరూ విడదీసి పంచుకుని మాకు వేదన మిగల్చద్దు. పండుటాకులం. ఎప్పుడు రాలిపోతామో తెలీదు. మాలో ఏ ఒక్కరు ముందు పోయినా మరుక్షణం మరొకరి శ్వాసా ఆగిపోక మానదు. కాబట్టి మిగిలిన ఈ కొద్దికాలాన్ని కేవలం మాకోసం మేం జీవించటానికి ఈ పని చేశాం. దయచేసి మమ్మల్ని అర్థం చేసుకోండి.

మనవలకి మా ముద్దులు. సెలవు.

మీ

అమ్మా, నాన్న

* * *

వేగుచుక్క పొడిచినా ప్రకృతి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని చీకటి దుప్పటి తొలగించుకోలేదింకా. వేగంగా పోతున్న రైల్లో ఫస్టుక్లాసు కూపేలో ఏకాంతంగా వున్న ఆ దంపతుల మనసుల్లో ఆనంద పరవశం. తన ఒడిలో వున్న భర్త తలని సుతారంగా, ప్రేమగా, లాలనగా నిమురుతున్న ఆమె మదిలో ఇదీ అని చెప్పలేని వింతానుభూతి.

**మీకు మా ఆశీస్సులు. నా జీవితంలో ఇలాంటి రోజు ఒకటి వస్తుందని మీకిలా ఉత్తరం రాయాల్సి వుంటుందని కల్లో కూడా అనుకోలేదు. ఒరేయ్! తల్లిదండ్రులిద్దరూ కలిసేరా పిల్లల్ని కనేది. కానీ ఆ ఇద్దర్నీ కలిపి ఒక దగ్గర వుంచుకోవడం వారికి భారమైపోతుందంటరా? రెక్కలొచ్చి పిల్లలు తమ దిక్కు తాము చూసుకున్నాక ఈ ముసలితనంలో వారికి అసలైన తోడు వారి జీవిత భాగస్వామియే.**

''అనూ...'' ఆర్తిగా పిలిచాడు.

''చెప్పు అనూ...'' ఆమె గొంతులో అంతులేని ఆప్యాయత.

''ఈరోజుకి గల ప్రత్యేకత ఏంటో గుర్తుందా!''

''తెలుసు. ఫిబ్రవరి పద్నాలుగు. ప్రేమికుల రోజు. చిన్నప్పుడు మనం ఇల్లొదిలి పారిపోయిన ఈరోజుని ఎలా మర్చిపోగలను?''

''ఈ శుభదినాన కోరికొకటి కోరనా?''

''అడుగు. ఎన్నడైనా కాదన్నానా?''

''ఆ పాట ఓసారి పాడవూ? అదే... మొదటిసారి నేను నిన్ను కలిసినప్పటిది''

''మనసున మల్లెల మాలలూగెనే - కన్నుల వెన్నెల డోలలూగెనే

ఎంత హాయి ఈరేయి నిండెనో - ఎన్నినాళ్ళకీ బ్రతుకు పండెనో''

కొంత ఆనందం, కొంత దుఃఖం సమ్మేళనంగా పాట సాగిపోతుంటే ఈ మధుర క్షణాల్ని శాశ్వతం చేస్తూ కాలమిక్కడే ఆగిపోవాలని కోరుకుంటున్న అనంతం గారి కళ్ళనుంచి రెండు కన్నీటి బిందువులు జారిపడ్డాయి.

★